దక్షిణ కోస్తా రైల్వేజోన్‌లోకి మధిర రైల్వేస్టేషన్

మధిర, ఫిబ్రవరి 9: దక్షిణ మధ్య రైల్వే పరిధిలో ఇప్పటి వరకు కొనసాగిన మధిర రైల్వేస్టేషన్ ఇక నుంచి దక్షిణ కోస్తా రైల్వేజోన్ పరిధిలోకి మారుతుంది. కేంద్ర ప్రభుత్వం ఇటీవల విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వేజోన్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. దీనికి సంబంధించిన డీపీఆర్లు సిద్ధం చేయాలని కేంద్ర రైల్వేబోర్డును ఆదేశించారు. ఈ ఆదేశాలతో ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడ సమీపంలోని కొండపల్లి నుంచి తెలంగాణ రాష్ట్రం పరిధిలోని బోనకల్లు మండలం మోటమర్రి రైల్వేస్టేషన్ వరకు 46 కి.మీ. పరిధిలో ఉన్న రైల్వేస్టేషన్లు మొత్తం కొత్తగా ఏర్పాటు చేయబోయే దక్షిణ కోస్తో రైల్వే జోన్ పరిధిలోకి వెళ్లనున్నాయి. దీంతో రాష్ట్రంలోని ఖమ్మం జిల్లాలో ఖమ్మం తర్వాత అతి పెద్ద రైల్వేస్టేషన్‌గా ఉన్న మధిర రైల్వేస్టేషన్ నుంచి దక్షిణ కోస్తా రైల్వేస్టేషన్ పరిధిలోకి వెళ్లనుంది. దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలో ఉన్నప్పుడు రైల్వేపనుల కోసం గతంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు సికింద్రాబాద్ వెళ్లేవారు. ఇప్పుడు మధిర ప్రాంత ప్రజలు రైల్వే పనుల కోసం విజయవాడలోని డీఆర్ఎం కార్యాలయానికి వెళ్లాల్సి ఉంటుందని రైల్వే ఉన్నతాధికారులు తెలుపుతున్నారు. అంతేకాకుండా కొండపల్లి నుంచి మోటమర్రి వరకు పనిచేస్తున్న రైల్వే ఉద్యోగులందరూ దక్షిణ మధ్య రైల్వే పరిధిలోకి వెళ్లాల్సి ఉంటుంది. వారి స్థానంలో కొత్త ఉద్యోగులు రానున్నారు.

కొనసాగుతున్న ప్రాక్టికల్ పరీక్షలు

ఖమ్మం అర్బన్, ఫిబ్రవరి 9 : ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న సైన్స్ విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రాక్టికల్ పరీక్షలు రెండో స్పెల్ కొనసాగుతున్నాయి. ఆదివారం ఉదయం సెషన్ జనరల్‌లో 29 కేంద్రాలు, ఒకేషనల్‌లో 6 కేంద్రాల్లో 1,729 మందికి 1,661మంది హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్ జనరల్‌లో 24 కేంద్రాల్లో ఒకేషనల్‌లో 5 కేంద్రాల్లో 1,542మందికి 1,482 మంది హాజరైనట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కె.రవిబాబు తెలిపారు. ప్రయోగ పరీక్షలు జరుగుతున్న కేంద్రాలను హైపవర్ కమిటీ, డెక్, ఫ్లయింగ్ స్క్వాడ్స్ బృందాలు తనిఖీ చేశాయి.

కెమెరాలతో కంట్రోల్

ప్రాక్టికల్ పరీక్షల్లో భాగంగా ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లోని ల్యాబ్‌ల్లో సీసీ కెమెరాలను అమర్చారు. ప్రైవేట్ కళాశాలల్లో అమర్చిన కొన్ని కెమెరాల్లో వాయిస్ సైతం రికార్డ్ అయ్యేలా ఉండటంతో ప్రాక్టికల్ పరీక్షలతో సంబంధం లేని ప్రైవేట్ కళాశాలకు చెందిన సిబ్బంది ఎవ్వరు ల్యాబ్‌ల వైపు పోయేందుకు కూడా సాహసించడం లేదు. గతంలో ప్రభుత్వ అధ్యాపకులతోపాటు ప్రైవేట్ కళాశాలల్లో పనిచేసే అధ్యాపకులకు ప్రయోగ పరీక్షల విధులు కేటాయించారు. ఇప్పుడు కేవలం ప్రభుత్వ అధ్యాపకులకు, ఒకటి రెండు రోజులు అది కొంతమందికి మాత్రమే ప్రైవేట్ అధ్యాపకులకు విధులు కేటాయించారు. ప్రాక్టికల్ పరీక్షల్లో ప్రైవేట్ అధ్యాపకుల సేవలు వినియోగించుకోకపోవడం పట్ల వారు అసంతృప్తిగా ఉన్నారు. సీసీ కెమెరాల ప్రభావం మార్కులపై పడనుంది. కొందరు విద్యార్థులు అనారోగ్య కారణాలతో మెరిట్ ఉన్నప్పటికీ ప్రాక్టికల్ పరీక్షల్లో పూర్తిస్థాయిలో ప్రతిభ కనబర్చలేకపోవడం, మరికొందరికి ప్రయోగ ఫలితాలు రాకపోవడం వంటి వాటితో చాలా తక్కువ మార్కులు వేస్తున్నట్లు ప్రైవేట్ కళాశాలల అధ్యాపకులు వాపోతున్నారు.

ఉచిత వైద్య శిబిరం

కూసుమంచి (నేలకొండపల్లి), ఫిబ్రవరి 9: నేలకొండపల్లిలోని నూతక్కి గంగాధర్ ఫౌండేషన్ బాధ్యులు ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 200 మందికి వైద్యులు ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. నెలకు సరిపడినన్ని మందులు ఇచ్చారు. డాక్టర్ చీకటి భారవి, డాక్టర్ సుబ్బారావు, గ్రామీణ వైద్యులు బండారుపల్లి నాగేశ్వరరావు, పుష్పలత, తానీషా, గుడవర్తి నాగేశ్వరరావు, సూర్యానారాయణ పాల్గొన్నారు.

మండలంలోని రాయిగూడెం జడ్పీ హైస్కూల్‌లో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని లాయన్స్ కంటి ఆసుపత్రి (వైరా) వైద్యులు నిర్వహించారు. దాదాపు 200 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో 30 మందికి శస్త్ర చికిత్స అవసరమని వైద్యులు గుర్తించారు. వైరాలోని తమ ఆసుపత్రిలో త్వరలోనే శస్త్ర చికిత్స చేస్తామని వైద్యులు చెప్పారు. ఏఎంసీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, డాక్టర్ రవిచంద్ర పాల్గొన్నారు.

ఘనంగా పీఆర్‌టీయూ ఆవిర్భావ దినోత్సవం

జెండా ఆవిష్కరణ చేస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

ఖమ్మం అర్బన్, ఫిబ్రవరి 9 : ఖమ్మం నగరంలోని పీఆర్‌టీయూ కార్యాలయంలో ఆదివారం ఆ సంఘం 54వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సంఘం జెండాను జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. ఉపాధ్యాయుల అనేక సమస్యలను పీఆర్‌టీయూ పరిష్కరించిందన్నారు. సంఘానికి సేవలందించి ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులు రమణారెడ్డి, సుమతి, సుభద్రాదేవి, మోహన్‌దాస్, రమణారావును సన్మానించారు.

తలసేమియా విద్యార్థులకు రక్తదానం

రఘునాథపాలెం, ఫిబ్రవరి 9 : రక్తం కొరతతో తలసేమియా విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన ఎస్సీ వసతిగృహ విద్యార్థులు రక్తదానం చేశారు. ఖమ్మంలోని సంక్షేమశాఖ బాలుర వసతిగృహ విద్యార్థులు రితన్య ఆసుపత్రిలో గల తలసేమియా డే కేర్ సెంటర్‌లో రక్తదానం చేశారు. రక్తదానం చేసిన విద్యార్థులను ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణ అభినందించి ధ్రువపత్రాలను అందజేశారు. చదువుతోపాటు సేవా కార్యక్రమాల్లో విద్యార్థులు ముందుంటున్నారని డీడీ కొనియాడారు. వసతి గృహ సంక్షేమాధికారి సత్తార్, సభ్యుడు ఎన్.ఉపేందర్ పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRL. SENIOR CIVIL JUDGE AT NALGONDA
O.P.NO.150 OF 2023

Between:
Mukkamula Mallikarjun ...Petitioner
And
Mukkamula Mahathi and another ... Defendants.

To:
R-2 G.Ramakrishna, S/o. Venkateshwarlu, age 34 years, Occ: Employee in TSWRS, Mudigonda Boys School, R/o. Chawdavaram Village, Vemsuru Mandal, Kammam District.

Where as the above named petitioner has filed the above petition for desolation of marriage... you are hereby summoned to appear in this court in person or by a pleader duly instructed and able to answer all material question relating to the petition on 24th day of February 2025 at 10-00 O clock in the per-noon before above court to answer the claim and as the day fixed for your appearance is appointed for the final disposal of the petition. On your failure to appear the matter will hear and determinded in your absence.
(By order of the Hon'ble court)

Sd/- **Vootukuri Surrender Reddy** BA. LL.B
Advocate
H.No.6-1-225, Nethaji Nagar, Ramgiri, Nalgonda-508001
Cell: 9948092479, 7396079549

మట్టూరి భద్రయ్య దంపతులకు నివాళి

పెనుబల్లి, ఫిబ్రవరి 9: కల్లూరు మండల పరిధిలోని సీపీఎం పార్టీ సీనియర్ నాయకుడు మట్టూరి భద్రయ్య దంపతులు ఇటీవల మృతిచెందిన విషయం విధితమే. ఆదివారం బీఆర్ఎస్ నాయకులు భద్రయ్య దంపతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు పాలెపు రామారావు, కల్లూరు సొసైటీ అధ్యక్షుడు బోబోలు లక్ష్మణరావు, దేవరపల్లి భాస్కర్‌రావు, పోట్రు కిరణ్, సొసైటీ మహిళా అధ్యక్షురాలు కొంగల నాగేంద్రమ్మ, బండి శ్రీనివాసరావు, కోలా వెంకటేశ్వరరావు, జక్కంపుడి కిశోర్, వల్లభనేని రవి, చింతలపాటి చెన్నారావు, వల్లభనేని శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

అ'పూర్వ'ం.. ఆత్మీయం..!

40 ఏళ్లకు కలుసుకున్న పదోతరగతి సహాధ్యాయులు

ఖమ్మం అర్బన్: 40 ఏళ్లకు కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ఖమ్మం అర్బన్, ఫిబ్రవరి 9: వీళ్లంతా బాల్య మిత్రులు. ఖమ్మం గాంధీచౌక్‌లోని 'స్వామి వివేకానంద ట్యుటోరియల్ కాలేజీ'లో 40 ఏళ్ల క్రితం పదోతరగతి (1983-84 బ్యాచ్) విద్యార్థులు. 1984లో పదోతరగతి పూర్తయ్యాక తలోదారిన వెళ్లారు. ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. 'మనవాళ్లు ఎవరెవరు ఎక్కడెక్కడ ఎలా ఉన్నారో..' తెలుసుకోవాలని అనుకున్నారు- వెగ్గళం శ్రీనివాస్, చెరుకూరు మురళి, కోసు రమేష్ గౌడ్, బండి రమేష్, అందే శ్రీనివాసరావు, కాసాల శ్రీనివాస్, హనుమంతరావు. ఎక్కడెక్కడో స్థిరపడిన తమ సహాధ్యాయులైన మిత్రులందరినీ కలిపేందుకు, నాటి ఆత్మీయానుబంధాన్ని తిరిగి చిగురింపజేసేందుకు అన్వేషణలోకి దిగారు. దాదాపుగా అందరి వివరాలను సేకరించారు. పరస్పర (తాజా) పరిచయాల కోసం వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేశారు. ఖమ్మంలోని ఓ హోటల్ వేదికగా 35 మంది మిత్రులు ఆదివారం కలుసుకున్నారు. వీరి ఆహ్వానాన్ని మన్నించి. దీవించేందుకు నాటి గురువులు కూడా వచ్చారు. 40 ఏళ్ల తర్వాత కలుసుకున్న ఈ మిత్రులంతా అనిర్వచనీయ అనుభూతికి లోనయ్యారు. ఆత్మీయ పలకరింపులతో మొదలైన సందడి.. సాయంత్రం వరకు సాగింది. నాటి చిలిపి పనులు, అల్లరి చేష్టలు, గిల్లి కజ్జాలు, గురువుల బెత్తం దెబ్బలు.. ఇలా అన్నీ గుర్తు చేసుకున్నారు. సరదా..సరదాగా.. అచ్చం 40 ఏళ్ల క్రితం నాటి బడి పిల్లల్లాగా మారిపోయారు. తమ కుటుంబాల యోగక్షేమాలను పంచుకున్నారు. తమ గురువులను సన్మానించి, ఆశీర్వచనాలు అందుకున్నారు. మళ్లీ మళ్లీ కలుసుకోవాలన్న ఆకాంక్షను వ్యక్తం చేస్తూ, మళ్లీ కలిసేది ఎన్నాళ్లకోనన్న బెంగతో, వీడలేక-ఉండలేక.. భారమైన హృదయాలతో వీడ్కోలు చెప్పుకున్నారు.

కొత్తగూడెంలో 1979-80 బ్యాచ్ విద్యార్థులు..

కొత్తగూడెం అర్బన్, ఫిబ్రవరి 9: పట్టణంలోని 35వ వార్డులోగల కూలీలైన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదోతరగతి 1979-80 బ్యాచ్ విద్యార్థుల అ'పూర్వ' సమ్మేళనం పట్టణంలోని హోటల్‌లో ఆదివారం జరిగింది. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. శ్రీరామచంద్ర ఉన్నత పాఠశాల రిటైర్డ్ హెచ్ఎం బ్రహ్మానందరావును, రవి బాలనికేతన్ హెచ్ఎం వెంకటేశ్వరరావును సన్మానించారు.

ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పాల్వంచలో 1984-85 విద్యార్థులు..

పాల్వంచలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

పాల్వంచ, ఫిబ్రవరి 9: పాల్వంచ బొల్లోరుగూడెం ఉన్నత పాఠశాల పదోతరగతి 1984-85 బ్యాచ్ విద్యార్థులు ఇన్నేళ్ల తర్వాత బాపూజీనగర్‌లోని సుంకర రామకోటేశ్వరరావు ఫాం హౌస్‌లో ఆదివారం కలుసుకున్నారు. సాయంత్రం వరకు ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఆనాటి గురువులను సన్మానించారు. ఇటీవల మృతి చెందిన ఆనాటి తెలుగు ఉపాధ్యాయుడు బ్రహ్మచారి ఇంటికి వెళ్లారు. తమ సారుతో ఉన్న అనుబంధాన్ని కుటుంబీకులతో పంచుకున్నారు. పూర్వ విద్యార్థులు కనగాల బాలకృష్ణ, సుంకర రామ కోటేశ్వరరావు, కొమరెల్లి రవీందర్, బూర్గుల దాసు, మంత్రి ఓం ప్రకాష్, సుధారాణి, కిలారు నిర్మల తదితరులు పాల్గొన్నారు.

ఇసుక, కంకరకుప్పలతో అస్తవ్యస్తం
యథాస్థితికి తీసుకరావాలని
ఇందిరమ్మకాలనీ గ్రామస్తుల వేడుకోలు

క్రీడా ప్రాంగణంలో నర్సరీ షెడ్

ఖమ్మంరూరల్, ఫిబ్రవరి 9: ఖమ్మంరూరల్ మండల కేంద్రమైన పెద్దతండ పెద్ద పంచాయతీ పరిధిలోని ఇందిరమ్మకాలనీలో ఉన్న విశాలమైన క్రీడా ప్రాంగణం అస్తవ్యస్తంగా తయ్యారైంది. గత బీఆర్ఎస్ సర్కార్ హయాంలో ప్రతి గ్రామంలో ఒక క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేసిన సంగతి విదితమే. సువిశాలమైన మైదానాలు ఏర్పాటు చేసి చుట్టూ ఫెన్సింగ్, క్రీడా పరికరాలను అందుబాటులో ఉంచారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో మరింత నైపుణ్యం పెంపొందించాలనే ఉద్దేశంతో రూ. కోట్లాది నిధులను వెచ్చించారు. అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో క్రీడా ప్రాంగణాలు అస్తవ్యస్తంగా తయ్యారయ్యాయి. సుమారు 20వేల మంది జనాభా కలిగిన ఇందిరమ్మకాలనీ గ్రామం లో పంచాయతీ అధికారులు క్రీడాస్ఫూర్తిని మరిచి ఏకంగా మైదానంలో నర్సరీ షెడ్‌ను ఏర్పాటు చేశారు. దీంతో క్రీడా ప్రాంగణం కాస్తా మొక్కల పెంపకానికి నిలయంగా మారింది. కొద్దిరోజులకే కొందరు గుత్తేదారులు ఇదే మైదానాన్ని ఉపయోగిస్తూ ఇసుక, కంకర డంపింగ్ చేసుకునేందుకు వాడుతుండటంతో సుందరమైన, విశాలమైన క్రీడా ప్రాంగణం అధ్వాన్నంగా మారింది. ఉదయం, సాయంత్రం వేళ కనీసం వాకింగ్ చేయడానికి సైతం వీలులేకుండా ఉండడంతో వాకర్స్, క్రీడా అభిమానులు అధికారుల తీరు పట్ల అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయంపై మండల ఎంపీడీవో, నాటి స్పెషల్ ఆఫీసర్ ఎస్.కుమార్‌ను వివరణ కోరగా ప్రత్యేక పరిస్థితిలో నర్సరీ ఏర్పాటు చేశామని, ఒకటి రెండురోజుల్లో పూర్తిస్థాయిలో శుభ్రం చేసి తిరిగి యథావిధిగా క్రీడా ప్రాంగణం అమల్లోకి తీసుకొస్తామని తెలిపారు.

మైదానంలో ఏర్పాటు చేసిన నర్సరీ

ఇన్‌చార్జి సెక్రటరీ గడువు ముగియడంతో ఇబ్బందులు
వేతనాల కోసం అధికారులు, సిబ్బంది ఎదురుచూపు

ఖమ్మం ఏఎంసీలో నిలిచిన చెల్లింపులు

ఖమ్మం వ్యవసాయం, ఫిబ్రవరి 9: ఖమ్మం నగర వ్యవసాయ మార్కెట్లో ఆర్థిక లావాదేవీలు పక్షంరోజుల నుంచి నిలిచిపోయాయి. దీంతో చెల్లింపులు లేకపోవడంతో ఉద్యోగులు, రిటైర్డు ఉద్యోగులు, సిబ్బంది, గుత్తేదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం నగర వ్యవసాయ మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఇన్‌చార్జి హోదాలో ఉన్నారు. గతంలో సెక్రటరీ పనిచేసిన రుద్రాక్ష మల్లేషం జమ్మికుంట మార్కెట్ సెక్రటరీగా బదిలీ కాగా, ఆయన స్థానంలో ఏడాది క్రితం ప్రవీణ్‌కుమార్‌ను రాష్ట్ర మార్కెటింగ్‌శాఖ ఏడాది గడువుతో ఇన్‌చార్జి సెక్రటరీగా ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు బదిలీ చేసిన విషయం తెలిసిందే. అయితే గత నెల 25వ తేదీతో ఆయన గడువు ముగిసింది. నాటి నుంచి కేవలం సదరు అధికారి లుక్‌అవుట్ హోదాలో విధులు నిర్వహిస్తున్నారు. తిరిగి సదరు అధికారి గడువు రీషెడ్యూల్ చేయకపోవడంతో బిల్లుల చెల్లింపులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మార్కెట్లో వివిధ హోదాల్లో పనిచేస్తున్న అధికారులు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, సీజనల్ సిబ్బందికి నేటివరకు జనవరి నెలకు సంబంధించిన వేతనాలు అందలేదు. వీరితోపాటు రిటైర్డు ఉద్యోగులకు సైతం మార్కెట్ ట్రెజరీ నుంచి వేతనాలు విడుదల అందలేదు. రెండ్రోజుల క్రితం మార్కెట్ సెక్రటరీని కలిసిన రిటైర్డు ఉద్యోగులు తమ ఆర్థిక ఇబ్బందులను చైర్మన్ దృష్టికి సైతం తీసుకొచ్చారు. అదేవిధంగా మార్కెట్ యార్డుల క్లీనింగ్ చేసే గుత్తేదారులకు, ఇతర మౌలిక వసతుల నిర్వహణకు సైతం అడ్డంకులు ఎదురవుతున్నాయి. సెలక్షన్ గ్రేడ్ మార్కెట్ కావడంలో ఆర్థిక చెల్లింపులు ఎక్కడికక్కడా నిలిచిపోయాయి. ప్రస్తుతం ఉన్న సెక్రటరీ గడువు రీషెడ్యూల్ చేస్తారా, కొత్త అధికారిని నియమిస్తారా అనేది తేలడం లేదు.

సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలి

కారేపల్లి, ఫిబ్రవరి 9: గిరిజనుల ఆరాధ్య దైవం సంతు సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలని లంబాడా ఐక్యవేదిక(లైవ్) భద్రాద్రి జోన్ ఇన్‌చార్జి బానోత్ బాలు నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 15న మండల కేంద్రంలో ఏర్పాటు చేయనున్న సేవాలాల్ జయంతి నిర్వహణ కమిటీ సమావేశం ఆదివారం కారేపల్లిలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజన బంజారా జనాభా ఉన్న ప్రతి గ్రామంలో సేవాలాల్ జయంతిని ఘనంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు.

మధ్యప్రదేశ్ కూలీలకు దుస్తులు పంపిణీ

మధిర, ఫిబ్రవరి 9: కూలీ పనుల కోసం ఇటీవల మధ్యప్రదేశ్ రాష్ట్రం నుంచి మధిర పట్టణ సమీపంలోని గ్రామీణ ప్రాంతాలకు వచ్చి జీవనం సాగిస్తున్నారు. వారి పరిస్థితులను అడిగి తెలుసుకున్న సామాజిక సేవకుడు, మధిర ఆశామిత్ర లంకా కొండయ్య ఆదివారం లంకా ఫౌండేషన్ ద్వారా ఉచిత పాత బట్టల కేంద్రం ద్వారా 50 కుటుంబాలకు వస్త్రాలు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

పెనుబల్లి, ఫిబ్రవరి 9: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్ర గాయాలపాలైన ఘటన ఆదివారం మండలంలోని మండాలపాడు గ్రామం వద్ద జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండాలపాడు గ్రామం వద్ద జాతీయ రహదారిపై వీఎం.బంజర వైపు వస్తున్న కారును వెనుక నుంచి వస్తున్న ఆటో ఓవర్‌టెక్ చేసే సమయంలో ఢీకొట్టింది. ఆటో అదుపు తప్పి రోడ్డుపై పల్టీలు కొట్టడంతో మండలంలోని లింగగూడెం గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ శివశంకర్ రోడ్డుపై పడడంతో లారీ మోచేతిపై టైర్ ఎక్కడంతో గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమచారం అందించడంతో 108 వాహనంలో శివశంకర్‌ను పెనుబల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు.

బేతుపల్లిలో పేకాట రాయుళ్లు అరెస్టు

సత్తుపల్లిటౌన్, ఫిబ్రవరి 9: మండల పరిధిలోని బేతుపల్లి గ్రామంలోని ఓ మామిడి తోటలో పేకాట నిర్వహిస్తున్నారని సమాచారం టాస్క్‌ఫోర్సు అధికారులు ఆదివారం దాడులు చేశారు. ఈ దాడిలో ముగ్గురిని అదుపులోకి తీసుకోగా మరికొందరు అక్కడి నుంచి పరారీలో ఉన్నారు. అదుపులో తీసుకున్న వ్యక్తులు ఇచ్చిన సమాచారం మేరకు మరో ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సత్తుపల్లి ఎస్సై రఘు తెలిపారు.

వైరా బస్టాండ్ ముఖ ద్వారాలను పునరుద్ధరించాలి

వైరాటౌన్, ఫిబ్రవరి 9: వైరా బస్టాండ్‌లో ఉన్న మూసివేసిన రెండు మార్గాలను వెంటనే పునరుద్ధరించాలని అఖిలపక్ష నాయకులు పేర్కొన్నారు. ఆదివారం అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ.. ఆర్టీసీ ఆనాలోచిత చర్య వలన అనేక మంది ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మూసివేసిన ముఖద్వారాలను పునరుద్ధరించి యథావిధిగా కొనసాగించాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. కృష్ణార్జున్‌రావు, సీతారాములు, రవి, చలపతిరావు, సుధాకర్, రాఘవరావు, అశోక్, సురేష్, సురేష్, పాషా, రమేష్ పాల్గొన్నారు.

ముసలిమడుగులో కంటి వైద్యశిబిరం

వైరాటౌన్, ఫిబ్రవరి 9: హానోక్ కంటి హాస్పిటల్ వారు వైరా మండలంలోని ముసలిమడుగు గ్రామంలో ఆదివారం కంటి వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు కంటి పరీక్షలు చేసి పేదలకు కళ్ళద్దాలు పంపిణీ చేశారు.

టీయూసీఐ సభలను జయప్రదం చేయాలి

కారేపల్లి, ఫిబ్రవరి 9: ఈ నెల 16న కారేపల్లి మండల కేంద్రంలో నిర్వహించనున్న ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా(టీయూసీఐ) మండల ప్రథమ మహాసభను జయప్రదం చేయాలని సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కే.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. టేకులగూడెంలో ఆదివారం కరపత్రాన్ని ఆవిష్కరించారు.

సంక్షేమ రంగాలకు నిధులు పెంచాలి

వైరాటౌన్, ఫిబ్రవరి 9: కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగంతో పాటు విద్య, ఆరోగ్య సంక్షేమ రంగాలకు నిధులు పెంచాలని డిమాండ్ చేస్తూ సోమవారం హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో జరిగే మహా ధర్నాను జయప్రదం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. ఆదివారం ఏన్కూరు ప్రజాసంఘాల కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

వైరా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నేత్రదానం

వైరాటౌన్, ఫిబ్రవరి 9: వైరా మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో ఉంటున్న సుగ్గల నాగేశ్వరరావు అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. వైరా లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు చింతలపూడి వెంకటేశ్వరరావు ప్రోత్సాహంతో ఆయన నేత్రాలను ఖమ్మం నేత్రనిధికి దానం చేసేందుకు కుటుంబ సభ్యులు ముందుకు వచ్చారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఖమ్మం నేత్రనిధి వారు నేత్రాలను సేకరించారు.

ఘనంగా హార్వెస్ట్ స్కూల్ వార్షికోత్సవం

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న యాజమాన్యం

ఖమ్మం అర్బన్, ఫిబ్రవరి 9 : ఖమ్మం నగరంలోని హార్వెస్ట్ పాఠశాల ప్రైమరీ 23వ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. డాక్టర్ జంగాల సునీల్‌కుమార్ మాట్లాడుతూ నేటి సమాజంలో పోటీతత్వం బాగా పెరిగిందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యావిధానంలో ఎన్నో మార్పులు చోటుచేసుకుంటున్నాయని పేర్కొన్నారు. పాఠశాలలోని అవకాశాలను వినియోగించుకుని భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలని సూచించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో క్వెస్ట్ ఎడ్యుకేషనల్ చైర్మన్ డాక్టర్ వై.నాగమణి, హార్వెస్ట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పోపూరి రవిమారుత్, ప్రిన్సిపాల్ రామసహాయం పార్వతిరెడ్డి, మానస పాల్గొన్నారు.

సైలో బంకర్ వల్ల ప్రాణాలు పోతున్నాయి

సత్తుపల్లి, ఫిబ్రవరి9: కిష్టారం గ్రామంలో సింగరేణి ఏర్పాటు చేసిన సైలో బంకర్ వల్ల కాలుష్యంతో కిష్టారంలోని అంబేద్కర్‌కాలనీలో ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారంటూ ఆదివారం గ్రామస్తులు సింగరేణి పీవోను అడ్డుకున్నారు. సింగరేణి జీఎం ఆదేశాల మేరకు అంబేద్కర్‌కాలనీను పరిశీలించేందుకు వచ్చిన కిష్టారం ఓసీపీవో నరసింహారావును అంబేద్కర్‌కాలనీవాసులు అడ్డుకున్నారు. సైలోబంకర్ వల్ల కాలుష్యంతో అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని, ఎన్ని సార్లు విన్నవించినా సింగరేణి అధికారులు పట్టించుకోవడం లేదంటూ నిరసన వ్యక్తం చేశారు. తమ సమస్యను పరిష్కరించకుంటే ఓసీలోకి వెళ్లి పనులు నిలిపివేస్తామంటూ హెచ్చరించారు. ఇప్పటికైనా సైలోబంకర్‌ను ఇక్కడి నుంచి తరలించాలని డిమాండ్ చేశారు.

వేంకటేశ్వరస్వామి ఆలయానికి రూ.లక్ష వితరణ

సత్తుపల్లి, ఫిబ్రవరి 9: పట్టణంలోని ద్వారకాపురి 7వ లైన్‌లో నిర్మాణం పూర్తయి ప్రతిష్ఠకు సిద్ధంగా ఉన్న శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఆదివారం పట్టణానికి చెందిన డాక్టర్ పుతుంబాక అనిల్‌కుమార్, డాక్టర్ లక్ష్మీప్రశాంతి దంపతులు, వారి కుమార్తె మోనిష, తల్లిదండ్రులు సీతాపతిరావు, నాగమాంబ, కుటుంబసభ్యులు నిర్మాణంలో 1,11,116 విరాళాన్ని ఆలయ బాధ్యులకు అందజేశారు.

పేదల స్థలాలు లాక్కుంటే ఉద్యమమే..

మధిర, ఫిబ్రవరి 9: పేదల ఇళ్ల స్థలాలు లాక్కుంటే ఉద్యమం నిర్వహిస్తామని సీపీఎం పార్టీ జిల్లా నాయకుడు శీలం నరసింహారావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సీపీఎం నాయకులు ఆదివారం రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించిన పట్టణంలోని హిందూ శ్మశానవాటిక స్థలాన్ని ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెవెన్యూ అధికారులు సమగ్ర భూసర్వే నిర్వహించి ఏ ప్రాంతంలో ఆక్రమణకు జరిగిందో గుర్తించి ఆ ప్రాంతం నుంచి భూమి రికవరీ చేయాలి తప్ప పేద ప్రజల స్థలాలను లాక్కోవద్దని అన్నారు.

మానవత్వం చాటుకున్న ఆదెమ్మ

మధిర, ఫిబ్రవరి 9: మధిర పట్టణంలోని ఓ పేదరాలైన బోయిన ఆదెమ్మ ఓ గుడిసెలో నివాసం ఉంటూ పట్టణంలోని కొన్ని ఇళ్లలో పనుల